క్లుప్తంగా

టీడీపీలో వర్గపోరు బహిర్గతం



అచ్చంపేట: మండలంలోని తెలుగుదేశం పార్టీ నేతల వర్గపోరు బహిర్గతమైంది. స్థానిక ఆంజనేయస్వామి విగ్రహం సెంటర్‌లో మంగళవారం జరిగిన నారా లోకేష్ జన్మదినోత్సవ వేడుకలలో పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు ఒకరిపై ఒకరు దూషణలకు దిగారు. ఒకరిపై ఒకరు దాడి చేసేందుకు సిద్ధపడ్డారు. పోలీసుల జోక్యంతో గొడవ సర్దుమణిగింది. టీడీపీ మండలాధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం లోకేష్ జన్మదినోత్సవ కేక్ కట్ చేస్తుండగా ఒక కార్యకర్త.. వీళ్లను ఎందుకు పిలిచారంటూ.. కామెంట్ చేయడంతో గొడవ ప్రారంభమైంది. తనను ఉద్దేశించే అన్నాడని భావించిన మాజీ జెడ్పీటీసీ నల్లమేకల వెంకటేశ్వర్లు వర్గం గొడవకు దిగింది. మరో టీడీపీ నాయకుడు జరుగుతున్న గొడవను దూరం నుంచి చూస్తూ తనకేమీ పట్టనట్లు వ్యవహరించాడు. తొలుత దూషణలతో ప్రారంభమైన గొడవ, జెండా కర్రలతో కొట్టుకునే వరకు వచ్చింది. ఇందులో జనసేన నాయకులూ ఉన్నారు. పోలీసులు రావడంతో అందరూ తలోదారి చూసుకున్నారు. లోకేష్ జన్మదినం కాస్త గొడవ దినంగా మారింది.

భజన బృందం సభ్యులకు సన్మానం



నకరికల్లు: ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను శ్రీరామ సేవా ఫౌండేషన్ విస్తృతంగా చేపడుతోందని అధ్యక్షుడు వేల్పుల కోటేశ్వరరావు అన్నారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట పురస్కరించుకొని చల్లగుండ్ల గ్రామంలోని భజన బృందాన్ని మంగళవారం ఘనంగా సన్మానించారు. చల్లగుండ్ల గ్రామంలోని అన్ని దేవాలయాల్లో కొన్నేళ్లుగా శ్రీరాముని సేవలో ఉన్న 150 మందిని సంఘం తరఫున సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కొత్త సూర్యప్రకాశరావు, చెన్నంశెట్టి శ్రీనివాసరావు, జక్కిరెడ్డి కోటిరెడ్డి, మేడా శ్రీనివాసరావు, మేడికొండ మాధవరెడ్డి పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి.. మరోసారి

సత్తెనపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష మొదట విడత వైద్య శిబిరాలు అద్భుత ఫలితాలు ఇవ్వడంతో.. రెండో విడత కార్యక్రమానికి ఈ నెల 2 నుంచి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, చిల్డ్రన్ స్పెషలిస్ట్ ప్రధానంగా ఉంటున్నారు. ఈ ముగ్గురితో పాటు కంటి వైద్యులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో డాక్టర్ ఎస్‌వీఎస్ సాయి తేజ రెడ్డి, డాక్టర్ జి.సరస్వతి, డాక్టర్ ఆసియా ఫాతిమా, డాక్టర్ మృదుల్లా తో పాటు పీఎంఓ కె.వీరాంజి నాయక్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఏఎన్‌ఎంలు వైద్య సేవలను అందించారు. మొత్తం 352 మంది శిబిరంలో ఓపీకి హాజరై వివిధ రకాల పరీక్షలు చేయించుకొని, మందులు పొందారు. వీరిలో మహిళలు 202 మంది, 150 మంది పురుషులు ఉన్నారు. ఎనిమిది మంది విద్యార్థులు, ఐదుగురు గర్భిణులు, నలుగురు బాలింతలు హాజరయ్యారు. 95 మంది నేత్ర పరీక్షలు చేయించుకోగా 80 మంది కళ్లజోళ్లు అందుకున్నారు.

అచ్చంపేట: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న కాంక్షతోనే సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నారని జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఓర్వకల్లులో మంగళవారం జంగిన రెండవ దశ జగనన్న సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొని, పరిశీలించారు. క్యాంప్‌లో మొత్తం 218మందికి జనరల్ వైద్య పరీక్షలు, 43 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఒకరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ వైద్యశాలకు రిఫర్ చేశారు. 8మందిని శుక్లాల ఆపరేషన్స్‌కు, 35మందికి కళ్ల జోళ్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక వైద్యాధికారులు డాక్టర్ వై.సుజాత, డాక్టర్ సాయి శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వి.రాంబాబు నాయక్, గ్రామ సర్పంచ్ కొలకలూరి పేరయ్య, ఎంపీటీసీ మేకా మల్లేశ్వరి, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు



రెడ్డిగూడెం శిబిరంలో వైద్య పరీక్షలు

ఇరుకుపాలెంలో ...

ఇరుకుపాలెం(ముప్పాళ్ల): ఇరుకుపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి, ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ రవీంద్రరత్నాకర్ పరిశీలించారు. శిబిరంలో ఆర్థో, గైనకాలజిస్ట్, పీడియాట్రిక్ విభాగాల నిపుణులు వైద్యసేవలందించారు. మొత్తం 348 మందికి అవసరమైన వైద్య సేవలందించినట్లు పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ ప్రవీణ్ తెలిపారు. 49 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 35 మందికి వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా కళ్లజోళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దరువూరి సుజాత, వైద్యులు గుంటుపల్లి కౌసల్య, బదిరీనారాయణ, ఈఓపీఆర్డీ రూపవతి, సీహెచ్‌ఓ ఆంజనేయులు, సూపర్‌వైజర్ పీటర్‌డేమియన్, జోస్పిన్ రాణి, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, పావని, శాంతి, ఏఎన్‌ఎంలు అన్నామణి, శాంతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రాజుపాలెం: రెడ్డిగూడెం గ్రామంలోని సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. డాక్టర్ రవితేజానాయక్ మాట్లాడుతూ.. శిబిరంలో 307మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 41 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశామన్నారు. డాక్టర్ సుష్మా, డాక్టర్ రవిశంకర్‌రెడ్డి వైద్య పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది ఉషారాణి, జ్యోత్స్న, శిరీష, ప్రమీల, విమల పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

సత్తెనపల్లి: సాయుధ పోరాటంతోనే స్వాతంత్ర్యం సాధ్యమని నమ్మి ఆంగ్లేయులకు ఎదురొడ్డి, తన దేశభక్తిని నేతాజీ సుభాష్ చంద్రబోస్ చాటారని సత్తెనపల్లి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కట్టా శంకరరావు అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి మంగళవారం నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ అడుగుజాడల్లో నడిచేందుకు యువత కృషి చేయాలన్నారు. చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కందకట్ల శంకరరావు, ప్రధాన కార్యదర్శి గంగదారి మణికంఠ, జిల్లా కార్యవర్గ సభ్యులు చందోలు వెంకట మల్లికార్జునరావు, గడ్డం శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు 'పరీక్ష పే చర్చ'



సత్తెనపల్లి: విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఎం.పద్మావతి తెలిపారు. పరీక్ష పే చర్చలో భాగంగా విద్యాలయంలో విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మండలంలో వివిధ పాఠశాలల నుంచి వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. చంద్రయాన్, స్పోర్టింగ్ సక్సెస్ ఆఫ్ ఇండియా, వికసిత్ భారత్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఆదిత్య ఎల్-1 అంశాలపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ స్థానం ఆర్.పార్థవి సాధించగా.. ఎం.హాసిని, హదస మెహత, దేవీ భవ్య, శృతి ద్వితీయ, తృతీయ తదుపరి స్థానాల్లో నిలిచారు. ఇందులో ఎంపిక చేసిన పది ఉత్తమ చిత్రాలు న్యూ ఢిల్లీలోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు పంపనున్నట్లు పద్మావతి తెలిపారు. ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్, ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాన్ని బహుమతిగా అందించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా మంగళవారం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. బహుమతులు ప్రదానం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఉషారాణి, కళాశాల సిబ్బంది డాక్టర్ రత్నకుమారి పాల్గొని, రైతులకు కొబ్బరితోటలో వచ్చే ఇరియోఫిడ్ నల్లి(రూట్ ఫీడింగ్) ని వేరుకు మందును, అంటు కట్టే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ శైలజ, రైతులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం



అచ్చంపేట: మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన గ్రామ సచివాలయాలు, హెల్త్ వెల్‌నెస్ భవనాలు, సీసీరోడ్లు, పెదపాలెంలో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం ప్రారంభించనున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య మంగళవారం తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో 971 మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.6.25కోట్లు పంపిణీ చేయనున్నారని పేర్కొన్నారు. చల్లగరిగ, తాళ్లచెరువు, పెదపాలెం, కోగంటివారిపాలెం గ్రామాల్లో రూ.43 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలు, చల్లగరిగ, చింతపల్లి, పెదపాలెం, కోగంటివారిపాలెం గ్రామాల్లో రూ.21లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ వెల్నెస్ భవనాలను ప్రారంభిస్తారని చెప్పారు. కోనూరులో సీసీ రోడ్లు ప్రారంభించి, జల జీవన్ మిషన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. తొలతగా స్థానిక జెడ్పీ హైస్కూలులో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొనాలని మండల కన్వీనర్ పేర్కొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'బంగారు తల్లి' వేడుకలు



సత్తెనపల్లి: ఆడపిల్లలు మగవారికి ఏ మాత్రం తీసిపోరని, అన్ని రంగాల్లో వారే ముందంజలో ఉన్నారని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు ఆడపిల్ల పుట్టగానే ప్రభుత్వ ఆసుపత్రిలో బంగారు తల్లి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెంటపాళ్లకు చెందిన ఏటగిరి విజయలక్ష్మి, అనిల్ దంపతులకు మూడో సంతానంగా మంగళవారం అమ్మాయి పుట్టింది. ప్రసవం అనంతరం పాప ఇంటి వద్దకు స్థానిక ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలను ఆహ్వానించి కేక్ కట్ చేసి, ఫోటో ఫ్రేమ్ అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆడ పిల్లల ప్రాముఖ్యత పెరగటానికి ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ బంగారు తల్లి పథకానికి సత్తెనపల్లిని ఎంచుకోవటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ సుజాత, రెంటపాళ్ల గ్రామ పెద్ద పెద మత్తయ్య, వార్డు ప్రెసిడెంట్ నాగేంద్రమ్మ, ఎమ్ఎల్‌హెచ్‌పీ సారిక, ఏఎన్‌ఎంకోటేశ్వరమ్మ, ఆశ వర్కర్ ఖశింబి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నియోజకవర్గస్థాయి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలు

అచ్చంపేట: స్థానిక శ్రీతుమ్మేపల్లి శ్రీరాములు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం నుంచి ఆడుదాం..ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. హైస్కూల్ పీడీ(ఫిజికల్ డైరెక్టర్) అలపాటి సుజాత, సర్పంచ్ కంబాల వీరబాబు, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ అంబటి రమేష్ మంగళవారం క్రీడామైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పీడీ సుజాత మాట్లాడుతూ క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. 24, 25 తేదీల్లో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటెన్ పోటీలు జరుగతాయన్నారు. 27, 29 తేదీల్లో క్రోసూరులోని జెడ్పీ హైస్కూలులో క్రికెట్, ఖోఖో పోటీలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలచిన వివిధ క్రీడా జట్లు ఉదయం 9 గంటలకు పాఠశాల మైదానంలో ఉండాలని తెలిపారు.

నేటి నుంచి సత్తెనపల్లి నియోజకవర్గంలో..

సత్తెనపల్లి: నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. మొదటి రోజు పట్టణంలోని శ్రీ వావిలాల ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటెన్, 25న ప్రగతి పాఠశాల మైదానంలో ఖోఖో, 27న శరభయ్య ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్, అదే రోజు ప్రగతి పాఠశాల ఆవరణలో కబడ్డీ, వాలీబాల్ బాల, బాలికలకు వేర్వేరుగా జరుగుతాయని వెల్లడించారు. 29న శరభయ్య ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని చెప్పారు.